క్లుప్తంగా

ఎమ్మెల్యే విస్తృత పర్యటన



ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్: స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం మండలవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. కోయరంగాపురం గ్రామంలోని శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజాకార్యక్రమాలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఊట్లపల్లి గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆదివారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం పలు గ్రామాల్లో పర్యటించి శుభకార్యాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, నాయకులు దొడ్డాకుల రాజేశ్వరరావు, దారా యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, రెడ్డిమళ్ల నాగయ్య, వాసం శ్రీను, రాయల నాగేశ్వరరావు, అబ్దుల్ జిన్నా తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంత



వినాయకపురం-దబ్బతోగు రహదారిపై పడిన గుంత

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని వినాయకపురం నుంచి దబ్బతోగు వైపు వెళ్లే ప్రధాన రహదారిపై గుంత పడి ప్రమాదకరంగా ఉంది. చిన్నపాటిగా ఉన్న ఈ గుంత అకాల వర్షాలతో పెద్దగా మారింది. ప్రధాన రహదారి కావడంతో అటువైపుగా వెళ్లే వాహనదారులు ఈ గుంత వద్ద ప్రమాదాలకు గురి అవుతున్నారు. ప్రమాదాలకు నిలయంగా ఉన్న గుంత వద్ద స్థానికులు హెచ్చరికగా ఓ కర్రకు సంచి కట్టి పెట్టారు. కాగా ఈ గుంతను తక్షణమే పూడ్చివేసేలా రోడ్లు భవనాల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై స్థానిక ఆర్అండ్‌బీ ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావును 'సాక్షి' వివరణ కోరగా.. గుంత పడిన మాట వాస్తవమేనని అన్నారు. దీనిని తక్షణమే పూడ్చి వేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ఎమ్మార్పీఎస్ దీక్షలు

మణుగూరుటౌన్: మణుగూరు మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన దీక్షలు చేపట్టారు. దళితబంధు పథకంలో అవినీతి అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలను కఠినంగా శిక్షించాలని కోరుతూ.. ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు దీక్షలు చేపట్టినారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు కొమ్ము హుస్సేన్ మాట్లాడుతూ.. దళితబంధు పథకంలో లబ్ధిదారుల నుంచి ఎమ్మెల్యేలు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేశారని రాష్ట్ర ముఖ్యమంత్రే బహిర్గతం చేశారని, అటువంటి వారిని వెంటనే పార్టీనుంచి సస్పెండ్ చేయాలని అన్నారు. దీక్షల్లో ఎమ్మార్పీఎస్ నేతలు చెక్క రమేష్, వెంకటేశ్వర్లు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న డీఈ జీవన్‌కుమార్

మణుగూరురూరల్: మండల పరిధిలోని చిక్కుడుగుంట గ్రామానికి చెందిన మాటూరి సాంబశివరావు పూరిల్లు గత నెలలో ప్రమాదవశాత్తు జరిగిన విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌లో పూర్తిగా కాలిపోవడంతో ఆ కుటుంబం సర్వం కోల్పోయి నిరాశ్రయమైంది. ఈ ప్రమాదంపై విద్యుత్‌శాఖ వారు స్పందించి బాధిత కుటుంబానికి ఆదివారం రూ.20వేలను భద్రాచలం డీఈ కె.జీవన్‌కుమార్ చేతుల మీదుగా ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏఈ జి.వేణుగోపాల్, విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వడ్డీ వ్యాపారం

- ఏజెన్సీలో అనుమతులు లేకుండా దందా
- ఏటా రూ.లక్షల్లో వసూలు
- బాధితుల్లో చిరువ్యాపారులు, సామాన్య ప్రజలు



చోరీకి గురై కుదువపెట్టిన ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. చాలా మంది ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారీతన దందా సాగిస్తున్నారు. పట్టణంలో ప్రతినెలా రూ.లక్షల్లో వ్యాపారం సాగుతోంది. బాధితుల్లో అత్యధికులు చిరు వ్యాపారులు, పేద కుటుంబాలకు చెందిన సామాన్యులే ఉంటున్నారు.

ఏజెన్సీలో అనుమతులు ఉండవు..

ఏజెన్సీ ప్రాంతాల్లో వడ్డీ వ్యాపారం చేయడానికి ఎలాంటి అర్హతలూ లేవు. ఇందుకు సంబంధించి ఎటువంటి రిజిస్ట్రేషన్‌లు ఉండవు. ఈ ప్రాంతాల్లో కేవలం ఆదివాసీయులకు మాత్రమే వడ్డీ వ్యాపారం చేయడానికి అర్హత ఉంది. వారుకూడా మనీ లెండింగ్ యాక్టు ప్రకారం ప్రభుత్వ అనుమతి తీసుకుంటేనే వడ్డీ వ్యాపారం చేయాలి. తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. నిర్ణీత చలానా చెల్లించాలి. వడ్డీ ఏడాదికి 14 శాతం మాత్రమే తీసుకోవాలి. ఎన్ని నెలలు వడ్డీ ఇస్తారో దాని ప్రకారం విభజించుకోవాలి. ఏటా లెక్కలు రెవెన్యూ అధికారులు పరిశీలించాలి. దీనికి తోడు ఈ వ్యాపారానికి ఆదాయపు పన్ను చెల్లించాలి. కానీ పట్టణంలో సుమారు 50 మంది వరకు దళారులు ఈ వ్యాపారం చేస్తుండగా.. వీరిలో ఆదివాసీలు కానివారు ఉన్నారు. ఆదివాసీలు ఉన్నా ఎటువంటి అనుమతులు తీసుకోవడంలేదు.

ఆభరణాలు కుదువ.. పేపర్లపై సంతకాలు

వడ్డీ వ్యాపారుల్లో బంగారు ఆభరణాలు కుదువ పెట్టుకుని ఇచ్చే వారే అత్యధికంగా ఉన్నారు. వ్యాపారులు ఫైనాన్స్ తీసుకునే పేదలతో పేపర్లపై సంతకాలు, వేలిముద్రలు వేయించుకుంటున్నారు. ఆ పేపర్‌లతో పాటు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, ఇంటి పన్ను రశీదు జిరాక్స్ కాపీలను తీసుకున్న తర్వాతనే ఫైనాన్స్ ఇస్తారు. సరైన సమయానికి వాయిదాలు చెల్లించకుంటే కోర్టులో కేసు వేస్తామని బెదిరింపులకు గురి చేస్తారు. ఇలా చిరువ్యాపారులకు, రైతులకు, సామాన్య ప్రజలకు అప్పు ఇస్తున్నారు. వడ్డీని ఏడాదికి కాకుండా ఆరు నెలల్లోనే తీసుకుంటున్నారు. అదికూడా నిబంధనలకు మించి అధిక మొత్తంలో ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

ధ్రువపత్రాలు పరిశీలించకుండానే..

వడ్డీ వ్యాపారులు వడ్డీ వస్తే చాలు అనే విధంగా వ్యవహరిస్తున్నారు. ఎవరైన ద్విచక్రవాహనాన్ని కుదవపెట్టి అప్పు అడిగితే.. ఆ వాహనాలు వారివేనా, పత్రాలున్నాయా అని కూడా పరిశీలించడం లేదు. ఈ క్రమంలో పట్టణంలో ఇటీవల దొంగతనాలకు గురైన ద్విచక్ర వాహనాలను బూర్గంపాడు మండలంలోని సారపాకకు చెందిన వడ్డీ వ్యాపారులు కుదువ పెట్టుకున్నారు. వాటిని తీసుకునేముందు పత్రాలను సరిచూసుకోలేదు. దొంగతనానికి గురైన ద్విచక్ర వాహనాలకు సంబంధించి పోలీసులు విచారణ చేస్తున్న సమయంలో ఈ విషయం బయటకి వచ్చింది.

రోజువారీ వసూళ్లు..

ఇచ్చిన అప్పును వడ్డీ వ్యాపారులు రోజుకు కొంత చొప్పున నిర్ణీత సమయం వరకు వసూలు చేస్తున్నారు. సాయంత్రం సమయంలో కూరగాయల మార్కెట్లు, టీకొట్టులు, చిరు వ్యాపారులు, పాల డబ్బాలు, ఆటో, జీపు డ్రైవర్ల నుంచి వడ్డీ వసూలు చేస్తుంటారు. రోజువారిగా వసూలు చేసే వారు రూ.10 వేల అప్పు కోసం ముందుగానే వెయ్యి వడ్డీ కింద తీసుకుని రూ.9 వేలు ఇస్తారు. అప్పుదారుడు రోజుకు రూ.100 చొప్పున 100 రోజుల పాటు చెల్లిస్తే రూ. 10 వేల అప్పు తీరుతుంది. అంటే 100 రోజులకు రూ.వెయ్యి వడ్డీ అన్నమాట. వీటన్నిటిపై దృష్టిపెట్టి అక్రమంగా నడుస్తున్న వడ్డీ వ్యాపారాన్ని అదుపుచేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



ఎవరైనా అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వేధింపులకు గురిచేసినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటి వరకు ఇలాంటి ఘటనలు మా దృష్టికి రాలేదు. చట్ట విరుద్ధమైన ఆర్థిక లావాదేవీలు ఎవరు నడిపినా శిక్షార్హులే. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే సహించేది లేదు. ఏజెన్సీలో వడ్డీ వ్యాపారానికి అనుమతులు లేవు.

– పి.నాగరాజు రెడ్డి, సీఐ, భద్రాచలం

మణుగూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



పట్టణంలో బైక్‌పై పర్యటిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరురూరల్: మణుగూరును ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నానని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఆదివారం మణుగూరులో ఆయన బైక్‌పై విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా ఆయన పలు వీధుల్లో తిరుగుతూ.. ప్రజలను పలకరించారు. సమస్యలను, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను కేటాయిస్తోందన్నారు. ఆయా నిధులతో మణుగూరు రూపురేఖలు మారనున్నాయన్నారు. ప్రతీ వార్డులో రోడ్లు, డ్రెయినేజీల వంటి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం..

మణుగూరు పట్టణంలోని గాంధీనగర్ ప్రాంతానికి చెందిన వాగబోయిన పాటెమ్మ పర్యటనలో భాగంగా ఆ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే రేగా కాంతారావు తన సమస్యను విన్నవించింది. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేగా.. సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో పాటు రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ.2వేలను ఆమెకు ఆర్థిక సాయంగా అందజేశారు.

డయాలసిస్ కేంద్రం పరిశీలన

మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని, వాటర్ ప్లాంట్‌ను ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలోనే డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



మణుగూరురూరల్: మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రాము



బూర్గంపాడు: మాజీ ఎంపీ పొంగులేటికి వినతిపత్రం అందిస్తున్న గ్రామదీపికలు

అశ్వాపురం: 21 రోజులుగా సమ్మె చేస్తున్న వీఓల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పినపాక మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని దీక్ష శిబిరాన్ని ఆదివారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పాయం మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించి వీఓఏల కుటుంబాలకు న్యాయం చేయాలన్నారు. కనీస వేతనం చెల్లింపు, సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించడం వంటి డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక పీఏసీఎస్ అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మొండికుంట ఎంపీటీసీ కమటం నరేష్, నాయకులు ముత్తినేని వాసు, వేములపల్లి రమేష్, ఓరుగంటి రమేష్, లంకమల్ల కొండలరావు, యక్కటి సత్యనారాయణరెడ్డి, తెల్లం వీరభద్రం, బొబ్బాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సంఘీభావం

మణుగూరురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల వీవోలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఆదివారం సమ్మె 21వ రోజుకు చేరుకోగా.. సమ్మె శిబిరాన్ని టీఎస్‌యుటీఎఫ్ నాయకులు సందర్శించి తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా కార్యదర్శి బాణోత్ రాము మాట్లాడుతూ.. గత 21రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.10లక్షల సాధారణ, ఆరోగ్య బీమాలు కల్పించాలన్నారు. అర్హులైన వీఓఏలను సీసీలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మీరాహుస్సేన్, నాయకులు కుమారస్వామి, రత్నప్రసాద్, వీఓఏల సంఘం నాయకులు సులోచన, గోపాల్, రామనర్సయ్య, జరీనాబేగం, లలిత, భారతి, నాఫిజా, పద్మ, వెంకటలక్ష్మి, పద్మ, సీత, అరుణ, వీవోఏలు పాల్గొన్నారు.

పొంగులేటికి వినతి..

బూర్గంపాడు: గ్రామదీపికల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మండల పర్యటనకు వచ్చిన ఆయనకు గ్రామదీపికలు వినతిపత్రం అందించారు. తమ సమస్యల పరిష్కారానికి మద్దతుగా నిలవాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఐకేపీలో ఏళ్ల తరబడి వెట్టిచాకిరి చేస్తున్న గ్రామదీపికలను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై పోరాటానికి మద్దతుగా నిలుస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ కైపు రోశిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు, గ్రామదీపికలు పాల్గొన్నారు.

సీతారామరాజుకు ఘన నివాళి



సభలో మాట్లాడుతున్న నూపా భాస్కర్

ములకలపల్లి: విప్లవ కిశోరం అల్లూరి సీతారామరాజు 99 వర్ధంతిని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని పాతగుండాలపాడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు నూపా భాస్కర్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు ఎలకం చలమన్న కారం వెంకటేశ్వర్లు, పర్సా రాంబాబు, సున్నం వెంకటేశ్వర్లు, కోండ్రు చంటి, సున్నం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: మండలపరిధిలోని కొత్తగుండ్ల గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో సంఘ అధ్యక్షుడు కంగాల వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు వాసం బుచ్చిబాబు మాట్లాడారు. సంఘ మండల అధ్యక్షుడు బాడిశ లక్ష్మణ్, సర్పంచ్ కంగాల లక్ష్మి, కొమరం సింగన్న, భీమరాజు పాల్గొన్నారు.

ఘనంగా 'వలస' పండుగ



తోటలో గ్రామస్తుల వంటావార్పు

అశ్వారావుపేటరూరల్: మండలపరిధిలోని నారంవారిగూడెం కాలనీవాసులు ముత్యాలమ్మతల్లి వలస పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. 14 ఏళ్లకు ఒకసారి గ్రామస్తులంతా కలసి ఈ వేడుకను అత్యంత వైభవోపేతంగా నిర్వహించుకుంటారు. ఇందులో భాగంగా గ్రామస్తులంతా ఉదయాన్నే కుటుంబసభ్యులతో కలసి సమీప తోటల్లోకి వెళ్లి, అక్కడే అమ్మవారి ప్రతిమలకు పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వివిధ రకాలు వంటలు తయారు చేసుకుని సామూహిక భోజనాలు చేశారు. తిరిగి ఇళ్లకు చేరుకున్నారు.

కొర్రాజులస్వామి జాతర

అశ్వారావుపేటరూరల్: మండలంలోని కొత్త నారావారిగూడెంలో ఉన్న శ్రీచిన్న కొర్రాజుల స్వామి జాతర ఆదివారం ప్రారంభమైంది. నాయకపోడు ఆదివాసీల ఆరాధ్యదైవం కొర్రాజులస్వామి జాతర వైభవంగా నిర్వహిస్తారు. ఇందులోభాగంగా గ్రామ పొలిమేర నుండి ఊరేగించారు. మంగళవాయిద్యాల నడుమ డోలు చప్పుళ్లు, గణాచారులు నృత్యాలతో స్వామివారిని ఉత్సవ విగ్రహాన్ని ప్రతి ఇంటి ముంగిటకు తీసుకెళ్లారు. ఊరేగింపు అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆలయంలో కొలువుదీర్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అశ్వాపురం: అశ్వాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1992–93 విద్యాసంవత్సరపు పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. 30 ఏళ్ల తరువాత ఆదివారం వారు చదువుకున్న పాఠశాలలో సమ్మేళన కార్యక్రమాన్ని సంబురంలా జరుపుకున్నారు. పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి సరస్వతి, సర్వేపల్లి రాధాకృష్ణ, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎక్కడెక్కడో స్థిరపడ్డ అందరూ తాము చిన్నతనంలో చదువుకున్న పాఠశాలలో కలుసుకొని తమ జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమొక్క, శాలువాతో సన్మానించారు. తమతో కలిసి చదువుకుని చనిపోయిన కొందరు పూర్వ విద్యార్థుల మృతికి సంతాపంగా మౌనం పాటించారు. పేదరికంతో ఉన్న కొంత మంది విద్యార్థుల చదువుకు సహాయం అందించారు. కార్యక్రమంలో కైలాసం రాము, మువ్వా శ్రీను, యార్లగడ్డ చందు, గరికపాటి అంజన్‌రావు, సంద్ర సతీష్, గంగాధర్ రామాచారి, తిరుమలరావు, నాగుర్‌వలి, బోస్, కొర్లకుంట శ్రీనివాస్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, రేణుక, సరళ, రమాదేవి, కిరణ్మయి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భద్రాచలంఅర్బన్: విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం కలగనున్నట్లు ఈఈ మైథిలి తెలిపారు. భద్రాచలం పట్టణంలోని టీటీడీ గుట్ట 11 కేవీ ఫీడర్‌లో ట్రీ కటింగ్ ప్రోగ్రాం ఉండటంతో ఈ ప్రాంతంలోని ఓల్డ్ మార్కెట్, గొల్ల బజార్, ముదిరాజ్ బజార్ చాకలి బజార్, సాయిబాబా టెంపుల్ ఏరియా, ఓల్డ్ ఎలెస్‌ఐసి ఆఫీస్ ఏరియా, అహోబిల మఠమ్, రంగనాయకుల గుట్ట ప్రాంతాల్లో ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం ఉన్న 33/11 సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు నేడు (సోమవారం) అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

సబ్‌స్టేషన్‌కు విద్యుత్ సరఫరా అయ్యే వినాయకపురం ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుండి 2గంటల వరకు ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

అటెన్షన్ ప్లీజ్

అధ్వానంగా రహదారి



ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డు నుంచి తాడ్వాయి వెళ్లే ప్రధాన రహదారిపై పలు చోట్ల గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. మండల పరిధిలోని తాటిగూడెం గ్రామ సమీపాన ఉన్న చప్టా వద్ద భారీ వాహనాల రాకపోకలతో పెద్ద గుంత ఏర్పడింది. దీనికితోడు వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో నీరు చేరి వాహనదారులు లోతును అంచనా వేయలేకుండా తయారైంది. ఈ నేపథ్యంలో దీనిని గమనించని వాహదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ మార్గం గుండా ప్రయాణిస్తున్నా దీనిపై దృష్టి పెట్టింది లేదు. ఇప్పటికైనా రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

- కరకగూడెం

ప్రశ్నించాల్సిన అధికారి: బి.రాంబాబు, ఆర్అండ్‌బీ ఏఈ
ఫోన్ నంబర్: 9441435367

రోడ్లపైనే ప్రయాణికుల పడిగాపులు

- ప్రధాన రహదారిపై లేని ప్రయాణ ప్రాంగణం
- గొందుల్లో నిర్మించడంతో అక్కరకు రాని బస్టాండ్
- రహదారుల వెంటే నిలబడుతున్న స్థానికులు



అశ్వాపురం మండల కేంద్రంలో రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

అశ్వాపురం: సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మ సాగర్, భారజల కర్మాగారం, మిషన్‌భగీరథ పథకం ఇలా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే పరిశ్రమలు, ప్రాజెక్టులతో అశ్వాపురం మండలానికి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉంది. అయినప్పటికీ మండల కేంద్రంలో కనీసం ప్రయాణ ప్రాంగణం లేదు. దీంతో ప్రజలు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రయాణ ప్రాంగణం లేక ప్రయాణికులు అశ్వాపురం సెంటర్‌లో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి బస్సుల కోసం నిలబడి ఎదురుచూస్తున్నారు. ప్రజలు ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణ ప్రాంగణం నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏండ్లుగా కోరుతునప్పటికీ పట్టించుకున్న నాథుడు లేడు.

నిరూపయోగంగా బస్టాండ్..

మండల కేంద్రంలో అమెర్థ రహదారి వెంబడి బస్టాండ్ ఉన్నా 30 ఏళ్లుగా శిథిలావస్థకు చేరి నిరూపంగా ఉంది. ఆర్టీసీ స్థలంలో ఎన్నో ఏళ్లుగా అధికారుల అనుమతితో అశ్వాపురం గ్రామ పంచాయతీవారు సంత నిర్వహిస్తుండగా.. ఇటీవల ఆర్టీసీ వారు అభ్యంతరం చెప్పడంతో సంత నిర్వహించడం లేదు. ప్రధాన రహదారికి సందులో బస్టాండ్ స్థలం ఉండటంతో బస్టాండ్ అక్కడ నిర్మించినా ప్రజలకు ఉపయోగం లేదు. ప్రధాన రహదారి వెంబడి బస్టాండ్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్అండ్‌బీ స్థలంపై ప్రతిపాదనలు

మండల కేంద్రంలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి ఆర్అండ్‌బీ కార్యాలయం ఎన్నో ఏళ్లుగా నిరూపయోగంగా ఉంది. భవనం శిథిలావస్థకు చేరి కూలిపోతోంది. ఇటీవల ఆర్అండ్‌బీ స్థలంలో నూతనంగా బస్టాండ్ నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. ఇటీవల మణుగూరులో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పర్యటనలో ఈ ప్రతిపాదన వచ్చింది. ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపారు. బస్టాండ్ నిర్మాణానికి ఆర్అండ్‌బీ అధికారులు ససేమిరా అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి ఆర్అండ్‌బీ శాఖ అధికారులతో మాట్లాడి ఆర్అండ్‌బీ స్థలంలో బస్టాండ్ నిర్మిస్తే మండల కేంద్ర ప్రజల ప్రయాణాలకు అనుకూలంగా ఉంటుంది. ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుంది. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి అశ్వాపురంలో బస్టాండ్ నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.